స్కెచ్

# ఓటుకోసం!

నిడదవోలు మాలతి

"నువ్వు ప్రెసిడెంట్‌గా ఎందుకు కంటెస్టు చెయ్యకూడదూ?" అంది శశిరేఖ.

"అవును ఎందుకు చెయ్యకూడదూ?" అన్నాను సాలోచన నభినయిస్తూ.

"ఫన్ కాదు. నిజంగానే చెయ్యి నేను ప్రపోజ్ చేస్తాను."

"నీ ఓటు గ్యారంటీ అని తెలుసులే. మరొక ఓటు ఏదీ?"

"మరొక ఓటేమిటి?"

"నువ్వు ప్రపోజ్ చేస్తావులే. సెకండ్ చెయ్య డానికి మరొక ఓటేది?"

"యిన్‌ఫీరియారిటీ కాంప్లక్స్ లా ఫీలవకు."

ఆ రోజే మధ్యాహ్నం అహల్యాదేవి. రెండు రూపాయల డిపాజిట్ (వాస్తవికత కోసం!)తో సహా నామినేషన్ దాఖలు చేసేశాను. అరుణా దేవి కూడా కంటెస్టు చేస్తున్నట్టు తెలిసి కొంచెం భయంలాంటిది వేసింది. ఆమాటే శశితో అంటే 'నెవర్ మైండ్' అంది.

కాన్వాసింగ్ భారీ ఎత్తున ఏర్పాటు చేసింది శశిరేఖ. ఆఖరికి ఆ దెబ్బతో ఊళ్ళో అందరూ కూడా రిజల్ట్‌కోసం ఎదురు చూడసాగేరు. "ఫలానా లేడీస్ కాలేజీకి ఎవరు ప్రెసిడెంట్ అవుతారోన"ని. కొందరి దృష్టిలో శశిరేఖే కాండిడేట్‌గా గుర్తింపబడింది! తరవాత అలాటి ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడ్డాం అనుకోండి.

ఇంకొక నాలుగురోజులు ఎలక్షన్ ఉందనగా ఆదివారం మధ్యాహ్నం వేళ శశివచ్చి, "ఓమాటు కల్పలతని కలుసుకోడం మంచిది. షికారుగా వెళ్ళి వద్దాం." అంది.

"కల్పలత ఎవరు?" అన్నాను.

"ఫస్టియర్. లే చెప్తా. పద." అంది వగరుస్తూ "తనవల్ల పాతిక ఓట్లు సుళువుగా వచ్చేస్తాయి."

"పద. స్వంతకారు కూడాఉంది" అన్నాను. (నాకు కాదులెండి!)

"ముందు రుక్మిణిదగ్గిరికి వెళ్దాం. తనకి తెలుసు వాళ్ళిల్లు."

"రుక్మిణి మనతో వస్తుందా?" అన్నాను.

"ఏం?"

"రుక్మిణీకు మనఅప్పొనెంట్ రిలేషన్స్‌గదా?"

" ఆప్టరాల్! ఈ—చిన్నవాటికి రిలెషన్స్ రిలేషన్స్ అని పట్టుకూర్చుంటారేమిటి? ఇందులో పెద్దకలి సొచ్చేదేముంది కనక?"

"లేకపోతే ఏ ఎసెంబ్లీకో అయితే మనవాళ్ళని అక్రమంగా అమూల్యమైన ఓటు నిదుర్వినియోగం చేస్తారంటావా!"

"కాదుమరి. అక్కడ బంధుప్రీతి చూపిస్తే ఏదోలాభం."

"ఆ మాటా నిజమేలే. ఇప్పడలాగే జరుగుతోంది. మనిషి న్యాయాన్యాయాలు విచారించడు స్వలాభం చూసుకొని ఎందుకనో." అన్నాను.

శశికి ఎవరిమీద విసుగేసిందో, "మనపాటి తెలివిలేక" అంది. పోస్టాఫీసు దాటేక కుడివేపు మూడోసందులో పసుపు మేడట. తీరా అక్కడికొచ్చేసరికి డైలమాలో పడ్డాం. కుడివేపు మేడా? ఎడం వేపుదా?

"టాస్ వేద్దాం." అన్నాను.

"నావన్నీ నోట్లూ చెక్కులూ" అందిశశి.

ఆఖరికి డ్రైవర్‌దగ్గిర ఇచ్చపావలా అప్పుపుచ్చుకొని టాస్‌వస్తే అది ఎడంవేపు మొగ్గింది.

"నువ్వు వెళ్లు మేం కార్లో ఉంటాం." అంది. మేం అంటే తను చెల్లెల్ని తీసుకొచ్చింది. ముగ్గురం వెళ్ళడ మేమిటని నా చెల్లెలు కూడావచ్చింది.

"నువ్వురా. నన్ను నేను ఇంట్రడ్యూస్ చేసుకోడ మేమిట"న్నాను.

"ఇంతమంది వెళ్ళడమేమిటి దండయాత్రలా!"

తప్పనిసరిగా ఒక్కర్తినే వెళ్లాను. గేటు తెరచి వరండా గడిచి, హాలుచేరుకున్నా మానవుల జాడ కనిపించలేదు ఆ భవంతిలో. బిక్కుబిక్కుమంటూ ఉందది.

రెండంగలలో కారు చేరుకున్నాను, "అదే కల్పలతాదేవి అంతఃపురమైతే దానికో నమస్కారం. పద, వెనక్కిపోదాం. అదేం ఇల్లు? దెయ్యాల కొంపయితే. ఆయింట్లో మనుషులు ఇన్విజిబుల్‌గా గాలిలో తిరుగుతున్నారు. వాళ్లు దెయ్యాలు. నీకెలా తెలిసిందంటావా? రెండుమాట్లు పిలిచాను, "ఎవరూ?" "వస్తున్నా"నన్న మాటలొస్తున్నాయి కాని వస్తూన్న మనిషి జాడలేదు."

"నీ మొహం. నేను వస్తాను పద."

"ఊహుఁ, వస్తానుకాదు. వెళ్లు నేనుమటుకు మరి రాను"అన్నాను.

శశి బలవంతంమీద కుడివేపు ఇంట్లోకి వెళ్లాను. ఎవరో ఒకావిడ సోఫాలో కూర్చొని రేడియో వింటూ, పేపరు చదువుతూ, పనిమనిషికేదో చెప్తూనే నన్ను చూసి "ఎవరుకావాలి?" అంది.

"మిస్ కల్పలతాదేవి గారి ఇల్లు ఇదేనాండి?"

"ఇది కల్పలతా దేవిగారిల్లు కాదుగాని లత ఇక్కడే ఉంది. లోపలికిరా" అంటూ పనిమనిషికి 'లత'ని పిలవమని చెప్పింది బహు దర్జాగా.

నేను "మీరు" అంటూంటే, "నువ్వు" అంటూన్న ఆమె అసభ్యతకి నొచ్చుకున్నా నా అనవసరం కనక అట్టే పట్టించుకోకుండా గుమ్మం లోనే నిలబడ్డాను.

"లతా నువ్వు ఒకే గ్రూపా?"

"ఏమోనండీ. నాది ఇకనిమిక్స్ మెయిన్."

"ఒహో నువ్వా లతా ఫ్రెండ్వా?"

"ఊఁ, ఆఁ, ఫ్రేండ్సేనండీ. అంటే ఇప్పుడు నేనెందుకొచ్చానంటే..."

"ఏదో మాట్లాడుకోవాలి. అంతేనా?"

"పెద్ద సీక్రెట్స్ ఏమీకావండీ?"

"అయితే తరవాత ఎప్పుడైనా మాట్లాడుకో వచ్చన్నమాట."

"ఇప్పుడు వీల్లేదాండి?"

"వీలులేకేం. వచ్చేస్తుంది. జస్టు ఏ మినిట్. ఇంతకీ నాకు చెప్పకూడని సీక్రెట్‌లా ఉంది."

"చెప్పనిస్తే. ఏంలేదండి, ఈ ఎలక్షన్లలో..."

"ఏమిటి? కాన్వాసింగ్‌కా!"

నేను కూడా అంతగానే ఆశ్చర్యపోయాను. నిజంగా కాన్వాసింగ్ అంత ఘోర అపరాధమని నాకు తెలీదంతవరకూ.

"అయితే కమ్యూనిస్టువా?"

"కాదండి."

"కాంగ్రెస్?"

"పార్టీలతో నాకేం ప్రమేయం లేదండీ."

"ఐన్, ఎవరు కాఫీ ఇస్తే..."

తల తిరిగింది. కల్పలతా వద్దు కామధేనువూ వద్దు, ముం దీవిడని వదుల్చుకుంటే అంతే చాలు అనిపించింది.

"నామాట విని ఇంటికి వెళ్ళిపో, చదువుకొనే వాళ్ళు చదువుకున్నట్టుండక ఇవేం బుద్ధులు. బాగు పడే ఉద్దేశం లేదూ? కొలిస్తే జానెడు లేనివాళ్ళకి ఇదేజబ్బు—పార్టీలూ, ప్రచారాలూను. పెద్దవాళ్లు ఏమో చచ్చీ, చెడీ, డబ్బుతెచ్చి చదివి ఏదో ఉద్ధరిస్తారనుకుంటే మీరేమీ ప్రపంచాన్నే మర మ్మత్ చేయ సంకల్పిస్తున్నార్లా ఉంది. నీకు ఎన్నేళ్ళు? నీకు మార్కు లెన్ని?"...

ఆ తర్వాత తాడెక్కడో వదిలేసి, కార్లో నుండి "ఇంటికి" అన్నాను నీరసంగా. కార్లో శశికి అంతా చెప్పాను.

"కాలేజీ ఎలెక్షన్స్ అని చెప్పలేదూ?" అంది.

"టైమివ్వందే ఎలాచెప్పను?" అన్నాను.

ఆ సాయంత్రం అరుణాదేవి మాయింటికొచ్చింది.

మర్నాడు కాలేజీకి, మామూలుగా వెళ్ళాను. శశి నావేపుకోరగా చూస్తూ దూరంగా కూర్చుంది తనదగ్గరకెళ్ళి "విత్ డ్రా చేసుకొంటున్నా" అన్నాను నవ్వుతూ.

"ఏడవలేకపోయావ్" అని తనుముఖం చిట్లించి అంటూంటే నాకు నవ్వాగలేదు.

శశి ఒకనిముషం ఊరుకొని అంది. "నిన్న మనం వెళ్ళింది ఎవరింటికి తెల్సా?"

"ఊఁ"

"అరుణాదేవి యింటికి!"

ఒక్కక్షణంసేపు తనంటే ఏవ్యాభావం ఏర్పడింది. కవి అంటాడు ముందుదగా వెనకదగా కుడి ఎడమలదగాదగా అని. ముఖా ముఖీ నాతో చెప్పి ఉంటే...

★